క్లుప్తంగా

ఏంబీఏ ఫలితాల విడుదలకు వినతి


వీసీకి వినతిపత్రం అందిస్తున్న నేతలు

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో ఎంబీఏ ఒకటో, మూడో సెమిస్టర్ ఫలితాలను వెంటనే విడుదల చేయాలని జై భారత్ నేషనల్ పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు భార్గవ్ సాయి కోరారు. బుధవారం ఈ మేరకు వీసీ అప్పారావుకు వినతిపత్రం అందించారు. భార్గవ్ సాయి మాట్లాడుతూ పరీక్షలు నిర్వహించి 5 నెలలు గడిచినా ఫలితాలు వెల్లడించకపోవడం దారుణమన్నారు. నాలుగో సెమిస్టర్‌కు హాజరయ్యే విద్యార్థులకు తక్షణమే హాల్ టికెట్లు అందించాలని డిమాండ్ చేశారు. నేతలు అబ్బాస్, రామోజీ, పృథ్వీ, జగదీష్, చైతన్య పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ఆలపాటి


ఆలయం వెలుపల ఎమ్మెల్సీ ఆలపాటి రాజా

చంద్రగిరి : తిరుచానూరు పద్మావతీదేవిని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ బుధవారం సేవించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రాచపూటి రమేష్ సాహిత్యం ఆవిష్కరణ


పుస్తకావిష్కరణలో వీసీ తదితరులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఓఆర్ఐ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసి తిరుపతి నిఘా విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ సింగమాల చంద్రయ్య రచించిన రాచపూటి రమేష్ సాహిత్యం–పరిశీలన అనే పుస్తకాన్ని బుధవారం వర్సిటీలో వీసీ అప్పారావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేనేత వృత్తికారుల జీవితాన్ని వివరిస్తూ రాచపూటి రమేష్ రాసిన కథలపై పరిశోధన చేసి పుస్తకం రూపంలో డాక్టర్ చంద్రయ్య తీసుకురావడం అభినందనీయమన్నారు. ఓఆర్ఐ డైరెక్టర్ ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు, డిప్యూటీ రిజిస్ట్రార్ చంద్రయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పుష్పలత, అసిస్టెంట్ ఇంజినీర్ సుబ్రమణ్యం, డాక్టర్ నారాయణ గౌడ్, నిఘా విభాగం అధికారి వెంకటేష్, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

న్యాయ సేవలకు సిద్ధంగా ఉంటా

తిరుపతి రూరల్ : జిల్లాలో వైఎస్సార్‌సీపీ నేతలపై పెడుతున్న తప్పుడు కేసులను ఎదుర్కొని న్యాయ సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంటానని పార్టీ ఉమ్మడి జిల్లా లీగల్‌సెల్ ఉపాధ్యక్షుడు పసపాల సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం విజయవాడలో వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఆయన కలిశారు. తనపై నమ్మకంతో పదవిని ఇప్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధికారంలోకి వచ్చేంత వరకు పోరాటం సాగిస్తానని స్పష్టం చేశారు. అనంతరం మోహిత్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు.
16సీడీఆర్01–300148: మోహిత్‌రెడ్డిని సత్కరిస్తున్న సుధాకర్‌రెడ్డి

'సుందర'ం.. సూర్యనారాయణం


ఉభయ దేవేరీ సమేతంగా విహరిస్తున్న సుందరరాజస్వామివారు

చంద్రగిరి : తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా వెలసిన శ్రీసూర్యనారాయణ స్వామివారు బుధవారం తిరుచ్చిపై విహరించారు. దక్షిణాయన పుణ్యకాలం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం తిరుచ్చిపై కొలువుదీర్చి ఊరేగించారు. ఈ క్రమంలోనే శ్రీదేవి, భూదే సమేత శ్రీసుందర రాజ స్వామివారు బంగారు తిరుచ్చిపై ఆసీనులై నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

పాఠశాలకు వితరణగా ఫ్యాన్లు


ఫ్యాన్లు అందిస్తున్న దాతలు

చంద్రగిరి : మండలంలోని కొటాల జెడ్పీ పాఠశాలకు స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ శ్రీవ్యాల్, డైరెక్టర్ మహేష్, పూర్వ విద్యార్థి హేమశేఖర్ మూడు ఫ్యాన్‌లను బుధవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఉపాధ్యాయులు సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. హెచ్‌ఎం కేశవయ్య పాల్గొన్నారు.

ఎల్లమ్మ హుండీ లెక్కింపు

చంద్రగిరి : గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపును బుధవారం చేపట్టారు. మార్చి 26 నుంచి బుధవారం (112 రోజులు) వరకు వచ్చిన కానుకలను లెక్కించారు. అమ్మవారికి మొత్తం రూ.8.16లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆలయ ఈఓ మమత, ఉత్సవ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

మాటిచ్చి.. మట్టి కొట్టారు!

'జగనన్న కంటే ఎక్కువగా సంక్షేమ పథకాలు అందిస్తామని చంద్రబాబు చెబితే నమ్మాం.. గంపగుత్తగా మా ఓట్లు వేసేశాం.. అధికారంలోకి వచ్చాక ఆయన యథావిధిగా చేశారు మోసం.. మాటిచ్చి మా నోట్లో మట్టికొట్టారు.. ఏడాది గడిచినా ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా కబుర్లు చెబుతున్నారు.. కష్టం తెలియకుండా కాపాడిన జగనన్నను కాదని.. మాయగాడికి మద్దతు పలికినందుకు తగిన శాస్తి చేశారు' అంటూ నగరవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు మేనిఫెస్టో మోసాలను వివరించేందుకు వచ్చిన వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డితో తమ గోడు వెళ్లబోసుకున్నారు.

శివజ్యోతినగర్‌లో ఏర్పాటు చేసిన రచ్చబండలో మాట్లాడుతున్న అభినయ్‌రెడ్డి


- చంద్రబాబు ఇచ్చిన హామీలను నమ్మి మోసపోయాం
- మా ఇళ్లకు వస్తే కూటమి నేతలను చొక్కా పట్టుకుని నిలదీస్తాం
- ఒక్క పథకం కూడా ఇవ్వలేదని మహిళల ఆగ్రహం
- అభినయ్‌రెడ్డితో తమ గోడు వెళ్లబోసుకున్న నగర జనం
- బాబు మోసాల మేనిఫెస్టోను వివరించిన అభినయ్

తిరుపతి మంగళం : ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన చంద్రబాబుపై ప్రజలు మండిపడుతున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. రీకాల్ చంద్రబాబు మోసాల మేనిఫెస్టో కార్యక్రమంలో భాగంగా నగరంలోని 47వ డివిజన్ మాధవనగర్, 8వ డివిజన్ ఎర్రమిట్ట, 30వ డివిజన్ నెహ్రూనగర్, 37వ డివిజన్ గిరిపురం తదితర ప్రాంతాల్లో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించారు. 45వ డివిజన్ శివజ్యోతినగర్‌లోని ముత్తుమారియమ్మ ఆలయం వద్ద కార్పొరేటర్ అనీష్‌రాయల్ ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ అమలు అవుతున్నాయా..? సూపర్‌సిక్స్‌లో తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, యాభై ఏళ్లు నిండిన మహిళలకు పెన్షన్, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు వంటి సంక్షేమ పథకాలు వస్తున్నాయా? అంటూ స్థానికులను అడిగి గెలుసుకున్నారు. ఎమ్మెల్యేను సంక్షేమ పథకాల గురించి అడిగారా? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓట్లు కోసం వచ్చారే తప్ప ఇప్పటి వరకు ఎమ్మెల్యే ఎవరో కూడా తెలియదని, ఇప్పటి వరకు మా ఇళ్లకు గానీ, మా వీధికి గానీ వచ్చిన పాపాన పోలేదని స్థానికులు మండిపడ్డారు. కూటమి నాయకులు మా ఇళ్ల వద్దకు వస్తే చొక్కా పట్టుకుని నిలదీస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం అవుతున్నా చంద్రబాబు ఇచ్చి హామీల్లో ఏ ఒక్క పథకాన్ని ఇవ్వలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. .

ప్రజాసంక్షేమమే పరమావధి

ప్రజాసంక్షేమమే పరమావధిగా.. ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా కోరుకునే ఏకైక నాయకుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని భూమన అభినయ్‌రెడ్డి కొనియాడారు. గత ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన మేనిఫెస్టో హామీల ప్రకారం 13నెలలకు గానూ ఒక్కో ఇంటికి రూ. లక్ష నుంచి రూ. 2లక్షల వరకు ప్రజలకు లబ్ధి చేకూరాల్సి ఉందని, అయితే ఒక్క రూపాయి కూడ సంక్షేమ పథకాల రూపంలో ఇవ్వకుండా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది కాలంలో కూటమి నేతలు ఏదో ఉద్ధరించినట్లు తొలిఅడుగు పేరుతో ప్రజల వద్దకు వస్తున్నారని, అయితే వారేం చేశారో నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, కార్పొరేటర్లు కోటేశ్వరమ్మ, డాక్టర్ అనీష్‌రాయల్, తమ్ముడు గణేష్, బసవ గీత, ఆరణి సంధ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆరణిపై మహిళల ఆగ్రహం

సమస్యలతో సతమతమవుతుంటే ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని మాధవనగర్‌వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. డివిజన్‌కు వచ్చిన వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డిని స్థానికులు కలుసుకుని తమ సమస్యలు విన్నవించారు. వారం రోజులుగా నీళ్లు రావడంలేదని, వచ్చినా నాలుగు బిందెలు వస్తున్నాయన్నారు. ఇది వరకు తమ ప్రాంతానికి ఎమ్మెల్యే ఆరణి వచ్చారని, తాము సమస్యలు చెబుతుంటే పట్టించుకోకుండా వెళ్లిపోయారని ఆరోపించారు. మీరైనా స్పందించాలని అభినయ్‌ను కోరారు. దీనిపై స్పందించిన అభినయ్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. అవసరమైతే ఖాళీ బిందెలతో ధర్నాకు దిగుతానని భరోసా ఇచ్చారు.


తాగునీటి సమస్యపై అభినయ్‌కు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

నోటీస్ బోర్డు

- విద్యుత్ చార్జీల పెంపుపై ప్రజా వేదిక ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటలకు యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం.
- తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో జాతీయ స్థాయి నాటకోత్సవాల ప్రదర్శనపై ఉదయం 11 గంటలకు అభినయ్ ఆర్ట్స్ వ్యవస్థాక కార్యదర్శి బీఆర్.రెడ్డి మీడియా సమావేశం.
- కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ చేతులమీదుగా ఉదయం 11.30 గంటలకు తిరుపతి ఐఐటీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభం.

శాస్త్రోక్తంగా ఆణివార ఆస్థానం



పట్టువస్త్రాలను తీసుకువస్తున్న జీయర్‌స్వాములు


కోదండరామాలయంలో పూజలు

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజ స్వామి, శ్రీకోదండరామాలయం, అలిపిరి శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయాలలో బుధవారం సాయంత్రం శాస్త్రోక్తంగా ఆణివార ఆస్థానం నిర్వహించారు. పెద్దజీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, డిప్యూటీ ఈఓ వీఆర్ శాంతి, ఏఈఓ భాస్కర నారాయణ చౌదరి, డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి మహాభారత ఉత్సవాలు

తిరుపతి రూరల్ : మండలంలోని దుర్గసముద్రంలో గురువారం నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు మహాభారత ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేయించారు. గుడిని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉత్సవాల్లో ప్రతి రోజూ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు భాగవతారిణి రాణీరెడ్డి హరికథా కాలక్షేపం ఏర్పాటు చేశారు. అనంతరం రాత్రి 8గంటల నుంచి శ్రీవేంకటేశ్వర కళానాట్య మండలి వారు మహాభారతంలోని కీలక ఘట్టాలతో నాటకాలు ప్రదర్శించనున్నారు. ఉత్సవాల్లో భక్తులకు అన్నదానం చేపడుతున్నట్లు ఆలయ ధర్మకర్త మిట్టపల్లి ప్రసాద్‌రెడ్డి తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు

రోడ్డు మరమ్మతుకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

చంద్రగిరి : టవర్‌క్లాక్ నుంచి ఏరియా ఆస్పత్రికి వెళ్లే మార్గంలో నీటి వృథా అరికట్టేందుకు ఎట్టకేలకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నెల 14వ తేదీన సాక్షి దినపత్రికలో 'వాహనదారులకు తప్పని తిప్పలు' అనే శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు రెండు రోజులుగా మరమ్మతు పనులను చేపట్టారు. కాలువలోని గ్రిల్స్‌ను తొలగించడంతో పాటు నీరు వృథాగా వెళ్లకుండా జాగ్రతలు తీసుకున్నారు. ఈ క్రమంలో అండర్ డ్రైనేజీ పైపును సైతం ఏర్పాటు చేస్తున్నారు.


కాలువ గ్రిల్స్‌తో పాటు అండర్ డ్రైనేజీ కోసం పైపులైను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

• జోరు వాన

తిరుపతిలో బుధవారం సాయంత్రం జోరు వాన కురిసింది. పలు వీధుల్లో వర్షపు నీరు చేరింది. వరుణుడు కాస్త కరుణించడంతో నగరవాసులు ఆనందపడ్డారు. ఉక్కపోత నుంచి కాస్త ఉపశమనం పొందారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి


మహతి ఆడిటోరియం ప్రధాన రహదారిలో..


మధురా నగర్‌లో ఇళ్ల వద్ద చేరిన నీరు

సుభద్రమ్మకు నివాళి



నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి, అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : టీటీడీ విశ్రాంత డిప్యూటీ ఈఓ ప్రభాకర్‌రెడ్డి సతీమణి సుభద్రమ్మ బుధవారం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి వెంటనే వారి నివాసానికి వెళ్లి సుభద్రమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు. పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

బీసీ సంఘం నగర అధ్యక్షుడిగా శేషాద్రి

తిరుపతి కల్చరల్ : ఏపీ బీసీ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడుగా ఎం.శేషాద్రిని నియమించినట్లు సంఘం జిల్లా అధికార ప్రతినిధి ఆవుల బుజ్జిబాబు తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. నగర అధ్యక్షుడుగా బీసీల సమస్యలపై నిరంతరం పోరాటం సాగిస్తూ సంఘం బలోపేతానికి దోహదపడాలని సూచించారు. అనంతరం శేషాద్రికి ఆయన నియామక పత్రం అందజేశారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మునస్వామి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆవుల బుజ్జిబాబు

రాజీలతో కేసుల పరిష్కారం

పాకాల : కోర్టుల చుట్టూ తిరిగి సమయం వృథా చేసుకోకుండా రాజీలతో కేసులు పరిష్కరించుకోవాలని న్యాయమూర్తి పూర్ణిమాదేవి తెలిపారు. బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ కేసుల పరిష్కరణలో రాజీనే రాజ మార్గమని వెల్లడించారు. న్యాయవాదులు గురుస్వామినాయుడు, గౌరీశంకర్‌రాజు, రెడ్డెప్పనాయుడు, చంద్రమోహన్, ప్రవీణ్‌ప్రకాష్, చలపతిరాజు, ప్రిన్సిపల్ రెడ్డిరాజు పాల్గొన్నారు.


ర్యాలీ ప్రారంభిస్తున్న న్యాయమూర్తి

ముగిసిన వార్షిక వైద్య పరీక్షలు

రేణిగుంట: మండలంలోని అమర రాజా ఆడిటోరియంలో అమర హాస్పిటల్, కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్, అమర రాజా గ్రూప్స్ సంయుక్తంగా మూడు రోజుల పాటు జిల్లావ్యాప్తంగా 2518 మంది పోలీసు సిబ్బందికి వార్షిక వైద్య పరీక్షలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బందికి ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆరోగ్య సమస్యలు ఉంటే ముందుగానే గుర్తించి సరైన వైద్యం చేయించుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు చేయించేందుకు సహకారం కావాలని అడిగిన వెంటనే ముందుకు వచ్చిన అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

సీపీఐ మహాసభలు రేపు

తిరుపతి కల్చరల్: సీపీఐ నగర మహాసభలను శుక్రవారం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి పి.మురళి తెలిపారు. బుధవారం ఈమేరకు కరపత్రాలు పంపిణీ చేశారు. డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని, రుయా, ప్రసూతి ఆస్పత్రుల్లో మౌలిక వసతులు కల్పించాలని, టీటీడీ నిధుల నుంచి 10 శాతం తిరుపతికి కేటాయించాలని, టీటీడీలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, నిరుపేదలకు రెండు సెంట్లు భూమి ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలనే అజెండాతో మహాసభలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆటోనగర్‌లోని కృష్ణారెడ్డి స్థూపం వద్ద ఉదయం 10 గంటలకు బహిరంగ సభ ఉంటుందన్నారు. 19న ప్రతినిధుల సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి హాజరవుతారని వెల్లడించారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న నేతలు

ఉపాధ్యాయులకు సత్కారం


టీచర్లను సత్కరిస్తున్న హెచ్‌ఎం తదితరులు

పాకాల : మండలంలోని మొగరాల జెడ్పీ హైస్కూల్ నుంచి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టీచర్లు బాలాజీనాయుడు, జయచంద్రనాయుడు, గణపతి, బోధనేతర సిబ్బంది దేవరాజులు, రేష్మ సేవలను కొనియాడారు. ప్రధానోపాధ్యాయిని సుమలత, లయన్స్ క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ రామయ్య, ఉపాధ్యాయులు వెంకటసిద్దులు, ఆదికేశవులు, రామమూర్తి, సుల్తాన్, నీరజ, విమలా విక్టోరియా, ప్రమోదిని, బాబు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

తిరుపతి లీగల్: అధిక మోతాదులో మద్యం తాగి ద్విచక్ర వాహనం నడిపిన కేసులో తిరుచానూరు యోగిమల్లవరానికి చెందిన పవన్ కల్యాణ్‌కు మూడు రోజులు జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. స్వల్ప మోతాదులో మద్యం తాగి వాహనాల నడుపుతున్న 13 మంది రూ.10వేల చొప్పున జరిమానా విధించారు.

అల్పాహారం వితరణ

తిరుపతి కల్చరల్ : లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి ఆధ్వర్యంలో బుధవారం ప్రసూతి ఆస్పత్రి వద్ద పేదలకు అల్పాహారం వితరణ చేశారు. అనంతరం 75 మందికి ఉచితంగా బీపీ, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు బండగి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి సి.చక్రపాణి, కోశాధికారి వి.పురుషోత్తం నాయుడు, ఉపాధ్యక్షుడు జి.శంకర్, సభ్యులు రామారావు, మురళి, షేకీజా పాల్గొన్నారు.


టిఫిన్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

అడుగడుగునా అలసత్వం

- ఏరియా ఆస్పత్రిలో రోగుల అవస్థలు
- సమయపాలన పాటించని వైద్యులు
- కనీస మాత్రం పర్యవేక్షించని అధికారులు

చంద్రగిరి ఏరియా ఆస్పత్రిలో రోగులు నానా అవస్థలు పడుతున్నారు. సిబ్బంది అలసత్వం కారణంగా సకాలంలో చికిత్సలకు దూరమవుతున్నారు. ఓపీ తీసుకునేందుకు సైతం పడిగాపులు కాస్తున్నారు. ఈ క్రమంలోనే సమయపాలన పాటించని వైద్యులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విధులు వచ్చిన వారు సైతం రౌండ్స్ పేరుతో మరింత కాలయాపన చేస్తున్నారు. వైద్యసేవలను పర్యవేక్షించాల్సిన సూపరింటెండెంట్ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఫిర్యాదులు వస్తున్నప్పటికీ పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు.

చంద్రగిరి : స్థానిక ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వహించే వైద్యాధికారులు నిర్లక్ష్యం కారణంగా రోగులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పేరుకే పెద్ద ఆస్పత్రే తప్ప వైద్యాధికారులు మాత్రం అందుబాటులో ఉండడం లేదు. ముగ్గురు వైద్యులకు గాను ఒక్కరే విధులు నిర్వరిస్తున్నారు. బుధవారం ఈ మేరకు భారీ సంఖ్యలో రోగులు వచ్చారు. ఓపీ తీసుకునేందుకు అరగంటపాటు క్యూలో నిలబడాల్సి వచ్చింది. వైద్యుడికి చూపించుకునేందుకు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది.


ముగ్గురు వైద్యులకు గాను ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్న దృశ్యం పక్కనే ఖాళీగా వైద్యుల కుర్చీలు

తూతూ మంత్రంగా విధులు

ఏరియా ఆస్పత్రి వైద్యులు తూతూమంత్రంగా విధులు నిర్వర్తిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సకాలంలో ఆస్పత్రికి రావడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ వచ్చినా రౌండ్స్ పేరుతో మరింత ఆలస్యం చేస్తున్నారని వాపోతున్నారు. చికిత్సపొందేందుకు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే మాకు ఇదొకటే పనా..? రౌండ్లు కూడా ఉంటాయని ఒంటికాలిపై లేస్తున్నారని వెల్లడిస్తున్నారు. వైద్యుల నిర్లక్ష్యంపై ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని మండిపడుతున్నారు.


ఓపీ కోసం వేచి ఉన్న రోగులు

చర్యలు తీసుకుంటాం

చంద్రగిరి ఏరియా ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యంపై ఫిర్యాదులు అందాయి, త్వరలోనే ఆస్పత్రిని తనిఖీ చేసి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. రోగులతో వైద్యసిబ్బంది మర్యాదపూర్వంగా నడుచుకోవాలి. నాణ్యమైన సేవలు అందించాలి.
– ఆనందమూర్తి, ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్